


**జరిగిన కథ :** కన్యాకుబ్జాన్ని పాలించే తాళ ధ్వజుడనే రాజుగారి కుమారుల్లో ఐదుమంది ఉత్తర దిగ్విజయ యాత్రకు వెళ్లారు. సుడిగాలిలో చిక్కుకుని చాలాదూరంగా ఎగిరి పడ్డారు. వాళ్లలో పెద్దవాడైన విద్యాసాగరుడు ఒక పెద్ద కోటగోడ దాటి.. అక్కడ రహస్యంగా పెరుగుతున్న కాశ్మీర యువరాణిని పెళ్లి చేసుకుని హాయిగా ఉన్నాడు. మిగిలిన నలుగురు రాకుమారుల కథ ఇది.




# చిలక పురుషుడు

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

కాశ్మీరానికి ఉత్తరంగా గిరివ్రజమనే గొప్ప పట్టణం ఉంది. ఆ పట్టణానికి మూడువైపులా పెట్టని కోటలా దేవకూటమనే పర్వతం.. ఆకాశాన్ని తాకుతూ నిలబడి ఉంది. ఆ కొండశిఖరాన్ని ఎక్కిన వారు పక్షులై ఎగిరిపోతారని చెప్పుకొంటారు. ఆ కారణంచేత ఆ దేశపౌరులెవరూ కనీసం కట్టెలకోసం కూడా ఆ కొండ ఎక్కరు. పొరపాటుగానైనా ఎవరూ ఎక్కకుండా ఉండేందుకుగానూ పట్టణాధికారులు ఆ కొండచుట్టూ పెద్ద ప్రహరీ కట్టించారు.

అలా ఉండగా.. ఒకనాటి మిట్టమధ్యాహ్నవేళ ఆ కొండకు ఆవలినుంచి ఒక కోయ వనిత గిరివ్రజం పట్టణంలోకి ప్రవేశించింది. ఆమె ఒంటిపై రంగురంగుల పూసల హారాలున్నాయి. భుజంమీద ఒక చిలక ఉంది. మరో భుజానికి వేలాడుతున్న తట్టలో కొన్ని మువ్వల గుత్తులున్నాయి.

వాటిలోని కొన్ని గుత్తులు తీసి..

''మువ్వలమ్మా మువ్వలు! చిలక మువ్వలు!'' అని మాటిమాటికీ అరుస్తూ, రాజమార్గంలో తిరుగుతున్నది ఆ కోయ వనిత.

ఆమె కేకలు విని, కొంతమంది పౌరులు దగ్గరికి వచ్చారు. ఆమె సోయగానికి అచ్చెరువొందుతూ..

''పిల్లా! నీదే ఊరు? ఏ కులం?! ఈ మువ్వల వెల ఎంత? నీ మగడెవ్వడు?!'' అని ప్రశ్నించసాగారు.

అందుకామె..

''బాబులారా! మేం కోయవారం. మా కులగోత్రాలతో మీకేమి పని? కావాలంటే మువ్వలు కొనుక్కోండి. వీటి వెల తక్కువే కానీ, గొప్ప మహిమ కలిగినవి'' అని చెప్పింది.

''ఏమిటా మహిమ?'' అని రెట్టించారు కొందరు.

''ఈ మువ్వలు కడితే మాటలు రాని చిలకలైనా మాట్లాడతాయి. మాటకారి చిలకలైపోతాయి'' అన్నది.

ఆమె మాటలు విని..

''మా ఇంటికిరా.. నీ మువ్వలు కొంటాం'' అని పిలిచారు కొందరు ఆకతాయిలు.

వారి మాటల్లోని విరుపును గ్రహించిన కోయపిల్ల..

''చిలక లేనివారికి ఈ మువ్వలు అమ్మడానికి వీల్లేదని మా యజమాని శాసించాడు'' అని నిక్కచ్చిగా చెప్పింది.

ఆమెను వింతగా చూస్తూ, కొంతమంది వెంబడించసాగారు. అలా సాయంత్రం వరకూ ఆమె కొన్ని మువ్వలమ్మింది. చీకటి పడేవేళకు ఒక సత్రాన్ని ఆశ్రయించింది. ఆ తరువాత మరో రెండురోజులపాటు ఆ పట్టణమంతా తిరుగుతూ మువ్వలమ్ముతూనే ఉంది. ఆమె సోయగాన్ని గురించి, మాటలు – చేష్టల గురించి పౌరులంతా అబ్బురంగా చెప్పుకోసాగారు.

ఒకనాడు ఆమె పట్టణంలో మువ్వలమ్ముతుండగా భద్రిక అనే పేరుగల పరిచారిక దగ్గరికి వచ్చింది.

''నిన్ను మా యువరాణి తీసుకురమ్మంది'' అని ఆమెను కోటలోకి తీసుకుపోయింది.

గిరివ్రజం రాకుమారి పేరు ప్రఫుల్ల. ఆమె తన అంతఃపురంలో కూర్చుని ఉన్నది. కోయ వనిత రావడం గమనించగానే.. ఆమె తన ఆసనం మీదనుంచి లేచి నడిచివచ్చింది.

ఆమె సౌందర్యాన్ని ఆపాదమస్తకం తేరిపార చూసి అబ్బురపడుతూ..

''ఓ కోయెతా! నీ పేరేమి?'' అని అడిగింది.

''నా పేరు కామాచ్చి'' అని చెప్పింది ఆ కోయపిల్ల.

''మీదే ఊరు? పెళ్లయిందా?''.

''అన్ని ఊళ్లూ నావే. నాకు పెళ్లయింది'' అని తన భుజంపై వాలి ఉన్న చిలకను చూపిస్తూ..

''ఇదిగో.. ఈ చిలకే నా మగడు. ఈ చిలక మూలాన్నే ఈ ఏసం కట్టాను. ఈ చిలకే నా జీవనం.. నా దైవం!''.

''పిల్లా! నీ మాటలు నాకర్థం కావడం లేదు. చిలక వల్ల జీవనం గడుస్తున్నదంటే సరే కానీ, చిలక మగడు ఎలా కాగలదు?''.

''అమ్మా! మా కొండమాటలు మీకర్థం కావు. మగడంటే ఎవరు? మనకోసం ఎవడైతే ప్రాణం ఇస్తాడో వాడే! నేనొక చిలకను. నాకీ చిలక!''.

ఆమె మాటలు విని, రాకుమారి నిట్టూర్పు విడిచింది.

''ఏమిటో నాకేమీ బోధపడటం లేదు. అది సరేకానీ, కొద్దిరోజుల కిందట మేం ఒక కొండచిలకను కొన్నాం. అది పళ్లు తినదు. మాట్లాడదు. బెంగపెట్టుకున్నది కాబోలు. దానికి మాటలు నేర్పు. నీకు మంచి పారితోషికం ఇప్పిస్తాను'' అన్నది.